## విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



2లో

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 20 | మార్చి | 2025 పేజీలు 8

# లేని అంకెల గారడీ.. కుదరని కూర్పు





-విద్య, వైద్య రంగాలపై చిన్నచూపు
-సాగుకు కేటాయింపులు అంతంత మాత్రమే
-సంక్షేమ నిధులు పెరిగినా హామీల అమలు అనుమానమే
-సీతారామ మరింత జాప్యం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భట్టి విక్రమార్క పద్దులో అంకెల గారడీ లేకపోయినా కూర్పు సరిగ్గా లేదన్న భావన వ్యక్తమవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంత కంటే మెరుగైన బడ్జెట్ రాదని కొందరు వాదిస్తుండగా ఈ బడ్జెట్‌తో ఆరు హామీల అమలు అసాధ్యమని ఇది పేలవమైన బడ్జెట్ అని విపక్షం పెదవి విరుస్తుంది. ఈ బడ్జెట్‌తో ఈ రాష్ట్రం ఆశించిన స్థాయిలో ఆర్థిక వృద్ధి పొందలేదన్న విమర్శ వినిపిస్తుంది. రికార్డు స్థాయిలో రూ. 3,04,965 కోట్ల బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2.26.982 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.36,504 కోట్లుగా ఉంది. ఇందులో షెడ్యూల్ కులాల సంక్షేమానికి రూ.40.232 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి రూ. 31.605 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు పంచాయతీరాజ్, రూరల్ ఏరియాలకు బడ్జెట్‌లో సుమారు తొమ్మిదివేల కోట్లు తగ్గాయి. ఇరిగేషన్‌కు రూ. 23,373 కోట్లును కేటాయించారు. ప్రస్తుత ప్రాజెక్టుల పరిస్థితి, కేటాయింపులను పరిశీలిస్తే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడం అంత తేలిక కాదన్న విషయం అవగతమవుతుంది. ఖమ్మంజిల్లాకు సంబంధించి సీతారామ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తి చేస్తామని చెబుతున్నప్పటికీ కేటాయింపులను పరిశీలిస్తే మరో మూడేళ్లు కూడా పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. సీతారామకు బడ్జెట్‌లో కేవలం రూ.699 కోట్లు మాత్రమే కేటాయించారు. రూ. 8వేల కోట్ల వ్యయంతో 2018 నాటికి పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు వ్యయం రూ.19వేల కోట్లకు చేరుకుంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పిన మాటలు బడ్జెట్ కేటాయింపులను చూస్తే ఈ ప్రాజెక్టు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో మొండి చేయి చూపారు. ఆరోగ్యశాఖకు రూ.12.393 కోట్లు, విద్యాశాఖకు రూ. 23.108 కోట్లు కేటాయించారు. ఇందులో సింహ భాగం వేతనాలకే ఖర్చు కానున్నాయి. ఈ ఏడాది సమీకృత పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకున్నది. యూనివర్సిటీల అభివృద్ధి, సమీకృత పాఠశాలల నిర్మాణానికి ప్రత్యేక కేటాయింపులు లేకపోవడంతో విద్యకు కేటాయించిన బడ్జెట్‌లో

మిగతా 2లో..

## మహాసభలకు ముస్తాబైన వైరా








**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలకు వైరా ముస్తాబైంది. ఎన్నో ప్రజా ఉద్యమాలకు కేంద్ర బిందువైన వైరా రైతు సంఘం మహాసభలకు మరో మారు వేదిక కానుంది. స్థానిక కమ్మ వారి కళ్యాణ మండపంలో గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం జిల్లా 21వ మహాసభలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని 20 మండలాలకు ప్రాతినిథ్యం వహిస్తూ

మిగతా 2లో..

-నేడు రైతు సంఘం జిల్లా మహాసభ
-హాజరుకానున్న రైతు సంఘం నేతలు బాగం, పశ్య పద్మ
-మహాసభలలో పాల్గొననున్న 500 మంది ప్రతినిధులు

## వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న పాలకులు





- రాష్ట్ర రైతు సంఘం నేత బాగం
- పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాల్సిందే..
- సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/పాల్వంచ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. బుధవారం పాల్వంచ మండల పరిధిలోని జగన్నాథపురంలోని ముంతాజ్ ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత రైతు సంఘం జెండాను భాగం హేమంతరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ ప్రభుత్వం

మిగతా 2లో..

# లేని అంకెల గారడీ.. కుదరని కూర్పు

**(మొదటిపేజీ తరువాయి)**
సింహ బాగం వాటికే సరిపోతాయి. సంక్షేమ రంగానికి సంబంధించి బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు పైబడి కేటాయింపులు జరిగినా ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే సూచనలు కనిపించడం లేదు. మహిళలకు మహాలక్ష్మి పథకం క్రింద ఇస్తానన్న రూ. 2,500 కానీ, పింఛన్ రూ.4వేల పెంపు కానీ, సాధ్యమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యార్థినిలకు స్కూటీలు, రెండు లక్షలపై బడి రుణమాఫీ తదితర ఏ పథకం కూడా అమలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. కాకపోతే వ్యవసాయ రంగ కేటాయింపులు ఫర్వాలేదనిపించడం బడ్జెట్‌లో మోసపూరిత అంకెల గారడీ లేకపోవడం హర్షించదగిన పరిణామం. ఎస్సి, ఎస్టి, బిసి, సామాజిక వర్గాలకు కేటాయించిన నిధులు గడిచిన 15 ఏళ్ల నుంచి పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. నిధుల మళ్లింపు లేదా ఖర్చు చేయకపోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులనైనా సకాలంలో సక్రమంగా ఖర్చు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఖమ్మంజిల్లాకు సంబంధించి కాంగ్రెస్ విజయంలో ప్రధాన పాత్ర పోషించింది. పాలక వర్గంలోనూ ఈ జిల్లాకు విశిష్ట స్థానం దక్కింది. ముగ్గురు మంత్రులు ఉన్న ఈ జిల్లాకు బడ్జెట్ నుంచి ఆశించిన స్థాయిలో కేటాయింపులు జరపలేదన్న విమర్శకు ఈ బడ్జెట్ తావిచ్చింది. జిల్లాకు చెందిన ఆర్థిక మంత్రిగా రెండవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క స్థూల కేటాయింపుల తర్వాత పద్దుల కేటాయింపులో ఖమ్మంజిల్లాకు మేలు చేయాలని, చేస్తారని ఆశిద్దాం.

# వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న పాలకులు

**(మొదటిపేజీ తరువాయి)**



కార్పొరేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వ్యవసాయం రంగం దెబ్బ తింటే అన్ని రంగాలు మీద నష్టాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాలు గమనించి స్వామినాథన్ సిఫార్సులు తక్షణమే అమలు చేసి రైతాంగ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. వ్యవసాయ రంగం బలంగా ఉంటేనే అన్ని రంగాలు బాగా ఉంటాయని తెలిపారు. పంటలు మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే తప్ప వ్యవసాయంలో రైతు నిలబడగలుగుతాడని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా శక్తివంతమైన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రుణమాఫీ, రైతు భరోసా ఇస్తామని రైతులకు ఇచ్చిన హామీని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు ప్రాజెక్ట్ ప్రాధాన్యత కల్పించి పంటలకు సాగునీరు అందించే విధంగా పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు ఇచ్చేవారని గత పదిహేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేసిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు అందించాలని కోరారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాల్సిందేనని, ఫారెస్ట్ అధికారులు కవ్వింపు చర్యలకు పాల్పడద్దని, రైతులు, పోడు సాగుదారులు పట్ల గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే పోరాటాలు చేయక తప్పదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, భూక్యా దసురు, కుమారి హనుమంతరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డి.సుధాకర్, ఎండి యూసఫ్, వాకబోయిన రమేష్, వాడే లక్ష్మి, భిక్షం, నరాటి రమేష్, విజయలక్ష్మి, రవికుమార్, వేణు, ఇమ్మానియేల్, బానోత్ రంజిత్, కొంగర అప్పారావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, వైఎస్ గిరి, చెన్నయ్య, నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, ఇట్టి వెంకట్రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, ఆదినారాయణ, బిక్కులాల్, వేములపల్లి శ్రీనివాసరావు, జకరయ్య, ఆడకు పెద్ద వెంకటరామయ్య, వజ్ర వాసు, బాదవత్ శ్రీను, లావుడియా చందులాల్, భూక్యా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలకు ముస్తాబైన వైరా






**(మొదటిపేజీ తరువాయి)**
500 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నారు. మహాసభలను పురస్కరించుకుని నగరాన్ని రైతు సంఘం తోరణాలతో అలంకరించారు. ప్రధాన వీధుల్లో రైతు సంఘం డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గత మహాసభ బోనకల్‌లో జరగగా ఆ మహాసభ నుండి ఈ మహాసభ వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగం పట్ల అనుసరిస్తున్న వైఖరి, అమలు చేస్తున్న సంక్షేమ, చేయూత పథకాల గురించి మహాసభలలో చర్చించనున్నారు. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు సంఘం నిర్వహించిన ఆందోలన, పోరాట, సదస్సులకు సంబంధించి ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్న వ్యవసాయ రంగ పరిరక్షణకు పాలకులు అనుసరించాల్సిన వైఖరి రైతాంగ పోరాటాలపైన ఈ మహాసభలలో పలు తీర్మానాలను చేయనున్నారు. ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు పంటలకు మద్దతు ధర నిర్ణయం, రుణ విముక్తి చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు తదితర తీర్మానాలను ఈ మహాసభలలో ప్రవేశపెట్టి చర్చించనున్నారు. ఖమ్మంజిల్లాలో పూర్తి చేయాల్సిన సాగునీటి ప్రాజెక్టులు మారిన పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతులు తదితర విషయాలపై ఈ మహాసభ ప్రతినిధులకు వివరించనున్నారు. మహాసభలకు ముఖ్య అతిథుగా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాగం హేమంతరావు, పశ్య పద్మ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తదితరులు హాజరుకానున్నారు. మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు అడపా రామకోటయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, స్థానిక నాయకులు గడిచిన పది రోజులుగా మహాసభల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. స్థానికంగా పార్టీ నాయకులు, రైతు సంఘం కార్యకర్తలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

# కాషాయికరణ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాషాయికరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత పోరాడాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్‌లు పిలుపునిచ్చారు. ఈనెల 23న భగత్‌సింగ్ సహచరుల 94వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్మారక వారోత్సవాల్లో భాగంగా బుధవారం పులిపాటి ప్రసాద్ నర్సింగ్ కళాశాలలో మతోన్మాదం డ్రగ్స్ యువతపై ప్రభావం అనే అంశంపై ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి. సుధాకర్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని వాటిని అధిక మించి సేవా కార్యక్రమాలు, క్రీడా రంగాల్లో ముందుండాలన్నారు. కాషాయికరణ , మతోన్మాదానికి వ్యతిరేకంగా నేటి యువత, విద్యార్థులు పోరాడాలన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, లోకేష్, గీతాంజలి, పుష్ప, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలి

**ప్రజాపక్షం/కొణిజర్ల :** పదోతరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో భయం వీడాలని భయంతో పరీక్షరాయడానికి వెళితే చదివింది కూడా రాయలేరని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్ల హైస్కూల్ ను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో కలిసి కూర్చుని వారితో కలివిడిగా మెలిగారు. విద్యార్థులను ఆంగ్లంలో చదివించారు. 10వ తరగతి పరీక్షను విద్యార్థులు సులువుగా రాసేందుకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులంతా ప్రణాళిక ప్రకారం సిద్వమవ్వాలని అన్నారు. భయం ఉంటే చదివిందికూడా మర్చిపోతారని తెలిపారు. మనసు ప్రశాంతంగా ఉంటేనే పరీక్ష బాగా రాసే అవకాశం ఉంటుందని అన్నారు. పరీక్ష హాల్ లో ఉత్సాంగా పరీక్ష రాయాలని తెలిపాఉ. సంవత్సరం పాటు చదివిన చదువు పరీక్షల్లో వచ్చే ఫలితాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. బాగా చదివి జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. మనం ఒక స్థాయికి వచ్చిన తర్వాత మరో 10 మందికి మనం ఉపయోగపడాలని అన్నారు. వుయ్ కెన్ లెర్న్ ఇంగ్లీష్ తరగతి నిర్వహణ విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడిస్తు గ్రూప్‌గా ప్రదర్శనలను పిల్లల మధ్యలో కూర్చొని ఆసక్తిగా తిలకించారు. అనంతరం తనికెళ్ల గ్రామ సెంటర్ ప్రధానరహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంబించారు. అధికారులు, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నగర సమస్యల పరిష్కారానికి పోరాటాలు

## -నగర సమితి సమావేశంలో దండి సురేష్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో నెలకొన్న త్రాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రోడ్లతో పాటు పట్టణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పోరాటాలు నిర్వహించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలను గుర్తించాలని, పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఖమ్మం నగర సమితి సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. నూనె శశిధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ దశాబ్ద కాలంలో ఖమ్మం నగరం త్వరితగతిన విస్తరించిందని జిల్లాలో మూడవ వంతు జనాభా నగరంలోనే నివసిస్తున్నారన్నారు. వ్యాపార, వాణిజ్య అవసరాలతో పాటు బతుకుదెరువు కోసం పట్టణాలు, నగరాలకు వలస పెరిగిందని సురేష్ తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు. పట్టణ పేదలకు సంబంధించి సంక్షేమ కార్యక్రమాల అమలులో పాలకులు వైఫల్యం చెందారన్నారు. నివాస స్థలాల సమస్య తీవ్రంగా ఉందని పట్టణ పేదలకు ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని సురేష్ డిమాండ్ చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో పట్టణ పేదలను భాగస్వాములను చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. పోరాటాలు మాత్రమే సమస్యలు పరిష్కరిస్తాయని ఆయన తెలిపారు. ఈసమావేశంలో నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మెకానిక్ కుటుంబాలకు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్స్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో మెకానిక్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. బుధవారం యూనియన్ సభ్యత్వం కలిగిన మెకానిక్ కుటుంబాల్లో ఆడపిల్లలు జన్మించిన నలుగురికి రూ. 10వేల చొప్పున రూ. 40వేల ఆర్థిక సహాయాన్ని ట్రాఫిక్ ఎస్ఐ సాగర్ చేతుల మీదుగా చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ సాగర్ మాట్లాడుతూ యూనియన్ తరుపున ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ ఆడపిల్లలు జన్మించిన కుటుంబాలకు యూనియన్ అండగా ఉండేందుకు ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. యూనియన్‌లో సభ్యత్వం కలిగిన మెకానిక్ కుటుంబంలో ఆడపిల్ల జన్మిస్తే రూ. 10వేల చొప్పున సాయం అందిస్తామన్నారు.గతంలో రూ. 70వేలు సాయం చేశామని ఇప్పుడు రూ. 40వేలు సాయం చేశామని మొత్తం రూ.1.10 లక్షలు అందించినట్లు ఆయన తెలిపారు. ప్రతి మెకానిక్ కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మం, అన్వర్, మురళి, అనిల్, లాలయ్య, శేషు, వెంకటేష్, సుభాని, అబ్బాస్, నరేష్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 అమలు

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ఖమ్మం కమిషనరేట్ పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద ఈనెల 21 నుంచి ఏప్రిల్ నాలుగు వరకు సెక్షన్ 163 (బిఎన్ఎస్ఎస్ యాక్ట్) అమలులో ఉంటుందని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 97 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదన్నారు. ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డిజెలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించ రాదని సిపి తెలిపారు. పరీక్ష సమయంలో పరిసరాలలో ఇంటర్నేట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సిపి సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సిపి తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు.

# విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

**-బడ్జెట్‌లో విద్యా రంగాని మొండి చేయి**
**-ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది బడ్జెట్‌లో కేటాయించిన నిధులు చూస్తే అర్థమవుతుం దని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలి పారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం రూ. 7.57 శాతం నిధులు కేటా యించడంలోనే విద్యా రంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అవగతమవుతుందన్నారు. ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో డొల్లతనం కనిపిస్తుందని విద్యా రంగానికి కేటాయించాల్సిన కనీస బడ్జెట్‌ను కూడా కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన ప్రభుత్వం గత సంవత్సరం, ఈ సంవత్సరానికి 0.2 శాతం మాత్రమే కేటాయించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వ విద్యాలయాలకు తక్కువ నిధులు కేటా యించడం తగదన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ గురించి ప్రస్తావనే లేదని ఆయన విమర్శించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు సుమారుగా రూ.11,600 కేటాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ, గురుకులాల పరిస్థితి ఏమి టని ప్రశ్నించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ఊసేలేదని, డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశాలలు, సొంత భవనాల నిధులు లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. లేని యెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు కౌషిక్, నాయకులు మనోజ్, గణేష్, ప్రతాప్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**-డిఈవోకు ఏఐఎస్ఎఫ్ వినతి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి సమర్థవంతంగా పరీక్షలను నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 21 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసి టివి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టిసి బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు మనోజ్, ప్రతాప్, గణేష్, రాజేష్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

# పరిశ సీతారత్నం ట్రస్టు సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/ తల్లాడ :** జిల్లా విద్యారంగంలో పరిశ సీతారత్నం చారిట బుల్ ట్రస్టు సేవలు మరువలేనివని, ప్రతిభావంతులైన నిరుపేదల విద్యా ర్థుల ఉన్నత విద్యకు ట్రస్టు చేయూత అందించటం అభినందనీయమని ఎంఇఓ దామోదర్ ప్రసాద్ అన్నారు. తల్లాడ మండల పరిధిలోని అన్నా రుగూడెం ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరిశ సీతా రత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గిరిజారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇఓ మాట్లాడుతూ పదవ తరగతి విద్యా ర్థులు పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా కష్ట పడి చదవి మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారదాదేవి, మురళీకృష్ణ, స్వరాజ్యలక్ష్మి, రత్నకు మారి, రామకృష్ను, స్వామి, లాల్సయ్యద్, ఇమ్మాన్యుల్, రాజు, రామా రావు, గోపాలరావు, శ్రీదేవి, రాములు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్‌సీవర్గీకరణ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణమాదిగ మూడు దశాబ్దాల పోరాట ఫలితంగానే ఎస్‌సీ వర్గీకరణ, చట్టబద్ధత వచ్చాయని ఎమ్మాఆర్పీఎస్ జాతీయ నాయకులు వంగూరి ఆనందరావు అన్నారు. ఖమ్మం నగరంలోని ఖమ్మంరూరల్ మండల రెవిన్యూ కార్యాలయం ఎదుట గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న రిలేనిరహారదీక్షలు బుధవారంతో ముగిసాయి. ఈ సంద ర్భంగా మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, అమ రవీరులకు విజయాన్ని అంకితమిచ్చారు. ఈ సందర్భంగా వంగూరి మాట్లాడుతూ...మాదిగ, ఉపకులాల న్యాయమైన ఎస్‌సీవర్గీకరణ పోరాటానికి మద్దతునిచ్చిన పార్టీలు, ప్రజా సంఘా లు, కుల సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, సహకరించిన ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. తమ జాతి మంద కృష్ణమాదిగకు జన్మజన్మలు రుణపడి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్దెల లక్ష్మణ్‌మాదిగ, సిరిపురపు బొంద య్యమాదిగ, చీమలదారి విశ్వనాథ్, బుడగజంగాల నాయకులు కళ్లెం నాగభూషణం, జంగం గౌడ్, పాపిట్ల శ్రీనివాస్, మామిడాల వెంకటేష్, బొబ్బిళ్ల నాగరాజు, సురేష్, వివరాజ్, సురేష్, వెంకన్న, మైబూసు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏఐకేఎస్ 21వ మహాసభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** నేడు వైరాలో జరగ నున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం 21వ మహా సభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్నవెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్ గల సిపిఐ పార్టీ కార్యాలయంలో ము ఖ్యులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు సం ఘాలు, రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతుల హక్కుల సాధనతో పాటు పరిరక్షిం చేందుకు ఈ సభా వేదికపై శంఖారవం పూరించబోతున్నట్లు తెలిపారు. ఎంతో ప్రాధాన్యత కలి గిన సదస్సుకు రైతు సంఘాల నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రాంకోటి, రైతు సంఘం మండల సమితి సహాయకార్యదర్శి వెన్నం భాస్కర్, రైతు సంఘం నాయకులు వెంపటి సురేందర్, రామిడి రమేష్, గూడా బాబురెడ్డి, కొనకటి అశోక్‌రెడ్డి, ఏఐవైఎఫ్ యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్ పాల్గొన్నారు.

## కమిషనర్ కలిసిన బిఆర్ఎస్ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏదులాపురం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిని పెద్దతండలోని కార్యాయలంలో బిఆర్ఎస్ నేతలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సత్కరించి..పుష్పగుచ్చాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, నాయకులు గూడా సంజీవరెడ్డి,బానోత్ కృష్ణ, నల్లపునేని అప్పారావు, నారపాటి రమేష్, రెడ్యానాయక్, మైబల్‌సాబ్, రఫీ, అట్టూరి వీర బాబు, వీరన్న, భద్రం తదితరులు పాల్గొన్నారు.

## మొగలి వెంకయ్యకు సిపిఎం ఘన నివాళి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలం మల్లారం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీని యర్ నాయకులు మొగలి వెంకయ్య(72)అనా రోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. మల్లా రం గ్రామంలో సిపిఎం పార్టీ మొదటితరం కమ్యూనిస్టుగా పనిచేసిన మొగలి వెంకయ్య మృతి పట్ల సిపిఎం నాయకులు ద్రిగ్భాంతిని వ్యక్తం చేస్తూ సంతాపం తెలి పారు. బుధవారం మల్లారం మాజీ సర్పంచ్ మందడపు ఉపేంద్ర వెంకయ్య మృతదేహాన్ని సంద ర్శించి పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సిపిఎం పార్టీ మం డల కార్యదర్శి మందా సైదులు, గ్రామశాఖ కార్యదర్శి షేక్ ఉద్దండుసాహెబ్, మండల కమిటీ సభ్యులు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకయ్య మృతి సిపిఎం పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూ తిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం మండల నాయకులు గుండ్లపల్లి లక్ష్మీ నారాయణ, ఎర్ర నాగులు, వెంకటేశ్వర్లు, షేక్.నాగుల్‌మీరా, గుండ్లపల్లి రమణ ఉన్నారు.

## పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధి లోని ఇల్లూరు పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులకు గెలాక్సీ క్లబ్ మెంబర్ శాఖముడి రంగారావు వితరణతో అందించిన జామెంట్రీ బాక్స్, ప్యాడ్స్‌ను ఆయన చేతుల మీదుగా బుధ వారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా పాఠ శాల హెచ్ఎం రషీద్ మాట్లాడుతూ విద్యార్థులు అందరూ కూడా మంచిగా చదివి ఉత్తమ ఫలి తాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సేవా దృక్పథంతో విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించిన దాత రంగారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 22న బోడేపూడి సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని బోడేపూడి భవన్ నందు బోడేపూడి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సాధారణ వ్యాధుల చికిత్స, శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ నుండి కంటి వైద్యులు ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 6గంటల నుండి 9గంటల వరకు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులకు బుధవారం బనిగండ్లపాడు ప్రాథమిక ఆరో గ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, జలుబు, దగ్గు, కండ్ల కలకలు వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థినులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారంపై అవగాహనం కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ శాయిరెడ్డి, ఎఎన్ఎంలు స్నేహ, వసంత, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# నవమి భక్తులకు సకల సౌకర్యాలు

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** వచ్చేనెల 6,7 తేదీల్లో నిర్వహించి శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవానికి తరలివచ్చే భక్తులకు వేసవి కాలాన్ని దృష్టిలోపెట్టుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మిథిలా స్టేడియంలో జరుగుతున్న వివిధ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామ చంద్ర స్వామివారి కళ్యాణం, పట్టాభిషేకాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు పాలీహౌస్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గోదావరి కరకట్ట ప్రక్కన తక్కువ ఖర్చుతో బసచేసేందుకు క్యాంప్ సైడ్ హౌస్‌లు ఏర్పాటు చేశామని వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం దేవస్థానానికి చెందిన అన్ని పనులు పూర్తయ్యాయని, కళ్యాణ మండపంలో జరగాల్సిన పనులకు ప్రత్యేకాధికారులను నియమించామని, త్వరలో ఆ పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. కళ్యాణ మండపానికి నేరుగా వెళ్లేందుకు ప్రధాన కూడళ్లలో రూట్ మ్యాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని, భక్తులందరికీ స్వామివారి తలంబ్రాలు, ప్రసాదాలు అందే విధంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులకు కళ్యాణ మండపానికి చేరుకునేందుకు రవాణా సదుపాయాన్ని కల్పిస్తున్నామని, భక్తులకు కోసం అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నందున అధికారులకు భక్తులు కూడా సహకరించాలని, వేడుకలు ముగిసిన తర్వాత భక్తులు సురక్షితంగా వారివారి గమ్య స్థానాలకు చేరాలన్నారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలను, పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ దామోదర్ రావు, దేవస్థానం ఇఓ రమాదేవి, ఇరిగేషన్ డిఇ వెంకటేశ్వర్లు, దేవస్థానం డిఇ రవీంధర్, తహశిల్దార శ్రీనివాస్, గ్రామపంచాయితీ ఇఓ శ్రీనివాసరావుతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైరా లయన్స్‌క్లబ్‌కు అవార్డులు పర్వం

**బెస్ట్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి**




**ప్రజాపక్షం/వైరా:** వైరా లయన్స్‌క్లబ్ 10 సేవా అవార్డులు లభించాయి. జులై నుండి మార్చి వరకు వైరా లయన్స్‌క్లబ్ 150 సేవా కార్యక్రమాలకు పైగా నిర్వహించి రీజియన్‌లో నిలిచింది. క్యాలెండర్ ఈవెంట్స్ యువత సాధికారిక అవార్డులు హంగర్ రిలీఫ్ విద్యార్థులకు ఆర్థిక చేయూత కంటి కార్నియా సేకరణ దీంతో పాటుగా కుట్టుమిషన్లు, ల్యాప్టాప్‌లు, బ్యానర్ ప్రజెంటేషన్ డయాబెటిస్ సేవా కార్యక్రమాలకు అవార్డులు లభించాయి. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన రీజియన్ 5 మీట్‌లో రీజియన్ చైర్మన్ డిపిసి.రావు చేతుల మీదుగా ఈ అవార్డులను క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు అందుకున్నారు. ఈ సందర్భంగా రీజియన్ చైర్మన్ డిపిసి.రావు, జీఎస్టీ కోఆర్డినేటర్ వుంద్రు శ్యామ్‌బాబు మాట్లాడుతూ రీజియన్ జోన్‌లో ఉన్న వైరా క్లబ్ గ్రేట్ విజన్ క్లబ్ ఖమ్మం కొత్తగూడెం మిలీనియం సంపూర్ణ సింగరేణి శ్రీనగర్ తల్లాడ కల్లూరు 9 నెలల కాలంలో చేసిన అనేక సేవా కార్యక్రమాలకు అవార్డులు లభించాయని, రానున్న మూడు నెలల కాలంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో ఉండాలని క్లబ్ అధ్యక్షులకు సూచించారు. వీటితో పాటుగా పర్మినెంట్ ప్రాజెక్టులకు కూడా కృషి చేయాలని తెలిపారు. సెకండ్ ఉత్తమ జోన్ చైర్మన్‌గా వుంద్రు వరలక్ష్మి, ఉత్తమ సెకండ్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డును లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉత్తమ సెకండ్ బెస్ట్ ట్రెజరర్‌గా మరికంటి రాంగోపాల్ అవార్డులను అందుకున్నారు. అదేవిధంగా బెస్ట్ బ్యానర్ ప్రజంటేషన్ అవార్డును అందించారు. వైరాలోని లయన్స్‌క్లబ్‌లకు జిల్లాలో రీజియన్‌లో ఉన్న క్లబ్‌లకు అవార్డులు రావడం పట్ల గాట్ అంబాసిడర్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు అందించి జిల్లాలో క్లబ్‌లు సేవలందించాలని పేర్కొన్నారు. వైరా లయన్స్‌క్లబ్‌కు అవార్డులు రావడం పట్ల జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ తుమ్మలూరి మురళీధర్‌రెడ్డి, జిల్లా డిసి మదన్మోహన్, రేపాల డాక్టర్ వసుంధరదేవి, జిల్లా క్యాబినెట్ జాయింట్ సెక్రటరీ లగడపాటి ప్రభాకర్‌రావు, జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేందర్‌రావు, క్లబ్ సెక్రటరీ అబ్బూరి రమేష్, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ చింతోజు నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వనమా విశ్వేశ్వరరావు, డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, వై.బుచ్చిరామారావు, మాదినేని సునీత, గజ్జల కృష్ణమూర్తి, నూకల ప్రసాదరావు, నూకల శ్రీనివాసరావు, లయన్స్ సభ్యులు సూతకాని జైపాల్, ముళ్ళపాటి సీతారాములు, మాదినేని దుర్గాప్రసాద్, ఏపూరి రాజారావు, పులి కృష్ణార్జున్‌రావు, రంగా సత్యనారాయణ, పు ప్పాల అనంతరామయ్య, రాయపూడి వెంకటేష్, నూకల అన్నపూర్ణ, గద్దె నీరజ, పుష్పలత, చింతోజు సీత, కన్యదారి అనుమాయమ్మ, జాల మహాలక్ష్మి , చెరుకూరి శ్రీనివాసరావు, మిట్టపల్లి సత్యంబాబు, కొల్లా రాం బాబు, కట్ల సురేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, నల్లమోతు లక్ష్మీ నారాయణ, పిచ్చిరెడ్డి, నంబూరి రామారావు, నంబూరి శ్రీనివాసరావు, పోలా శ్రీనివాసరావు, తాల్లపల్లి కృష్ణ, మిట్టపల్లి రమణ, మిట్టపల్లి శివ తదితరులు అభినందనలు తెలియజేశారు.

# లారీ డ్రైవర్ ప్రాణాలు కాపాడిన పోలీసులు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** బతుకు తెరువు కోసం లారీ నడుపుతూ జీవనం సాగిస్తున్న లారీ డ్రైవర్ ఆకస్మికంగా గుండెపోటు రావటం అప్పుడే లారీ పక్కన ఓ బాటసారి వెళుతూ డ్రైవర్ కి కనిపించటం తనకు గుండెల్లో నొప్పి వస్తుంది 108 కి ఫోన్ చేయమని కోరాడు. బాటసారి వద్ద ఫోన్ లేక పోవటం తో సమయ స్ఫూర్తి గా వ్యవహరించిన ఆ బాటసారి పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన పోలీస్ కానిస్టేబుల్స్ స్పందించి స్థానిక వైద్యశాలకు తరలించి ఆ లారీ డ్రైవర్ ప్రాణాలు కాపాడారు. ఏలూరు జిల్లా చింతలపూడి నుండి మొక్కజొన్న లోడుతో హైదరాబాద్ వైపు వెళుతున్న లారీ బుధవారం ఉదయం పెనుబల్లి మండలం వియం బంజర్ గ్రామం చేరుకోగానే లారీ డ్రైవర్ మొగుళ్ళ కృష్ణారావు ఛాతిలో నొప్పి అనిపించి రోడ్డు ప్రక్కగా పోలీస్ స్టేషన్ ముందు లారిని నిలిపి వేశాడు. రోడ్డు పై వెళుతున్న బాటసారి రామకృష్ణ కి తన పరిస్థితి తెలపడంతో తను ప్రక్కనే ఉన్న పోలీస్ స్టేషన్ లోని పోలీస్‌లకు డ్రైవర్ పరిస్థితిని వివరించారు. డ్రైవర్ పరిస్థితిని గమనించి వెంటనే స్పందించిన స్పెషల్ బ్రాంచ్ పుల్లారావు, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుల్ వీర రాఘవులు పోలీస్ వాహనంలో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి లారీ డ్రైవర్ కృష్ణారావు ప్రాణాలను నిలబెట్టి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. ఓ సామాన్య వ్యక్తి, పోలీస్‌లు మానవత్వం తో వ్యవహరించిన తీరు పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. డ్రైవర్ స్వస్థలం ఏపిలోని చింతలపూడి దగ్గర లోని గోకవరం అని తెలిసింది.

# ఉపాధి హామీ కూలీలకు టెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలి



**ప్రజాపక్షం / పాల్వంచ :** గ్రామ పంచాయితీ ద్వారా ఉపాధి హామీ పనుల వద్ద టెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అండ్ డిఆర్‌డిఓ విద్యాచందన సూచించారు. బుధవారం పాల్వంచ మండల పరిధిలోని కేశవాపురం గ్రామ పంచాయితీలో జరుగుతున్న రోడ్డు నిర్మాణం, నర్సరీ, కమ్యూనిటీ సోక్ పిట్ పనులను ఆమె పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ..ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉదయం ఏడు గంటలకే పనుల వద్ద రావాలని, రూ.300 వచ్చే విధంగా కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పనులు చేసిన వివరాలు జాబ్ కార్డు నందు తప్పకుండా పొందుపరచాలని, ప్రతి కుటుంబం కూడా 100 రోజుల పాటు ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కూలీలు పలుగు, పార, తట్టలు లేక పని ఎక్కువ చేయలేకపోతున్నామని, పని సామాగ్రిని ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఏపీవో పొరండ్ల రంగా, గ్రామ పంచాయితీ కార్యదర్శి కృష్ణవేణి, క్షేత్ర సహాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# తుళ్లూరు కోటేశ్వరరావుకు దంపతులకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో స్వామి వారి కళ్యాణాల కోసం నూతనంగా వకుళామాత స్టేడియం నిర్మించి స్వామి వారి ఆలయానికి అందచేసిన సందర్భంగా ఎర్రుపాలెం మండల పాత్రికేయులు బుధవారం తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలాకుమారి దంపతులను అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వరస్వామి వారిపై ఉన్న భక్తిభావంతో ఎంతో వ్యయప్రయాసలతో రాష్ట్రంలో ఎక్కడ లేనివిధంగా కోటేశ్వరరావు దంపతులు కళ్యాణ మండపం నిర్మించి స్వామి వారిపై తమకున్న భక్తిని చాటుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు అంగిరేకుల రామకృష్ణ, యరమల శ్రీనివాస్ రెడ్డి, వయ్యూరు శ్రీనివాసరావు, కాపర్తి సతీష్, కుక్కల మురళీ, కోన రమేష్, తోట సాంబశివరావు, పసుపులేటి శివకృష్ణ, మహేష్, జమలయ్య, వెంకటకృష్ణారావు, సాయికుమార్ పాల్గొన్నారు.

# ఏఐకేఎస్ జిల్లా మహాసభకు భారీగా తరలి రావాలి



**ప్రజాపక్షం/చింతకాని :** గురువారం వైరాలో జరిగే ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా 21వ మహాసభకు చింతకాని మండలం నుంచి రైతులు భారీగా తరలి రావాలని చింతకాని మండల రైతు సంఘం అధ్యక్షుడు దొబ్బల వెంగళరావు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని కొదుమూరు, రాఘవాపురం గ్రామాల్లో మహాసభల విజయవంతం కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఏఐకేఎస్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.రైతులంతా సంఘటితమై భవిష్యత్ ఉద్యమాలకు సిద్దం కావాలన్నారు.గురువారం వైరాలో జరిగే ఖమ్మం జిల్లా మహాసభలో చింతకాని మండల రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు నక్కనబోయిన కృష్ణ నాయకులు నారపోగు బాబు, సారిక లింగయ్య, నిరుడు గోవిందరావు, నారపోగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయుడికి సామగ్రి పంపిణీ




**ప్రజాపక్షం/మణుగూరు:** మండలంలోని తిర్లాపురం పంచాయతీలో ఈ నెల 5వ తేదీన చింతల రాములుకు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. పూర్తి నిరాశ్రయుడైన బాధితుడి గురించి విషయం తెలుసుకున్న వాసవీ క్లబ్ సభ్యులు బుధవారం దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రూ.5 వేల విలువైన గ్యాస్ పొయ్యితో పాటు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాములు వాసవీక్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్, ఐపీసీ బండారు నర్సింహారావు, చిత్తలూరి రమేష్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు నుండి ఏటూరు నాగారం నగరం వెళ్లే ప్రధాన రహదారి బయ్యారం అడ్డరోడ్ వరకు గుంతలమయమై నిత్యం వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోతున్న, శాశ్వత వికలాంగుల అవుతున్న ప్రభుత్వం కానీ ఆర్ అండ్ బి అధికారులు కానీ నిమ్మకు నీరు ఎత్తకుండా ఉండటం వలన రహదారిలో ప్రయాణం సాగించాలంటే ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి అలాగే మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు సంబంధిత అధికారులు పట్టించుకోకుండా కాలం వెళ్ళదీస్తున్నారు. సమస్యలపై బుధవారం మణుగూరు సురక్ష బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తూ నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులను బలవంతంగా అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించిన స్థానిక పోలీస్‌లు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బీఆర్ఎస్ కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మ ణ్, మండల కో కన్వీనర్ నూకారపు రమేష్, మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, సీనియర్ నాయకుల తాళ్లపల్లి యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, ఎడ్ల శ్రీనివాస్, తాతారమణ, మేకల రవి, పోడుతూరి విక్రమ్, మణుగూరు మండల యువజన విభాగం అధ్యక్షుడు భోశెట్టి రవిప్రసాద్, టౌన్ యూత్ అధ్యక్షులు గుర్రం సృజన్, ఆవుల శ్రీను, విద్యార్థి విభాగం అధ్యక్షులు తాళ్లపల్లి రాహుల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఎస్సీ వర్గీకరణ చట్టం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదం పొందినందున హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా ఇసంపల్లి కృష్ణ మాదిగ మాట్లాడుతూ కృష్ణ మాదిగ తలపెట్టిన వర్గీకరణ ఉద్యమ ఫలితంగా మాదిగలకు సరైన న్యాయం జరిగిందన్నారు. ఈవర్గీకరణతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వేల మంది మాదిగ విద్యార్థులకు ఉద్యోగాలు వస్తాయని, అన్ని రంగాల్లో మాదిగ విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మిర్యాల వెంకన్న, గద్దల రామకృష్ణ, మడిపల్లి రమేష్, సుంచు రామ్మూర్తి, రమణయ్య, అలవాల నాగరాజు, గద్దల వెంకటేశ్వర్లు, కొమ్ము వెంకన్న, రాంబాబు, వెంకటేశ్వర్లు, శెట్టిపల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం పోరాడిన సంగయ్య ధన్యజీవి

## -తొమ్మిదవ వర్ధంతి సభలో బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు కార్మికుల హక్కుల కోసం పోరాడిన మేకల సంగయ్య ధన్యజీవి అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా కార్మికులను సమీకరించి వివిధ వర్గాలకు సంబంధించిన సంఘాలను ఏర్పాటు చేసి సంఘాల సంగయ్యగా పేరొందారన్నారు. మేకల సంగయ్య తొమ్మిదవ వర్ధంతి సందర్భంగా గిరిప్రసాద్ భవన్‌లో సంగయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష ఉద్యమాలలో పని చేశారని తుదిశ్వాస వరకు తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారన్నారు. తొలుత సాయుధ పోరాటంలో పనిచేసిన తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి పార్టీ విస్తృతికి కృషి చేశారన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, పట్టణ కార్యదర్శిగా, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సుదీర్ఘకాలం సేవలు అందించారన్నారు. సంగయ్య ఆశయ సాధనకు పునరంకితం కావాలని హేమంతరావు పిలుపునిచ్చారు. పాలక వర్గం తీరుమారుతున్న సామాజిక పరిస్థితుల్లో కమ్యూనిస్టుల అవసరాన్ని పెంచుతున్నాయన్నారు. వర్గ చైతన్యం కోసం కృషి జరగాలని హేమంతరావు కోరారు. ఆర్థిక అంతరాలు పేదల జీవనోపాధికి సవాల్‌గా మారడమే కాకుండా భవిష్యత్తులో అశాంతికి కారణమవుతాయని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాలే దేశంలో సంక్షేమ పథకాల అమలు, హక్కుల సాధనకు కారణమయ్యాయని హేమంతరావు తెలిపారు. అమరుల వారసత్వాన్ని కొనసాగిస్తూ భవిష్యత్తు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ములజితేందర్‌రెడ్డి, సింగు నర్సింహారావు లు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం / పాల్వంచ :** కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చిత్ర పటానికి జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ధన్యవాదాలు తెలుపుతూ పాల్వంచ పట్టణ పరిధిలోని అంబెద్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో సయ్యద్ రషీద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అసెంబ్లీలో ఉద్యమకారుల గురించి ప్రస్తావించిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఇదే విషయాన్ని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం తరపున గతంలో ఎమ్మెల్యే కూనంనేనికు వివరిస్తే ఆయన సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో చర్చించేందకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం సభ్యులు ఎస్‌డిటి హుస్సేన్, ఉబ్బన రవికుమార్, మహమ్మద్ సద్దాం, అరవెల్లి పెద్దిబాబు, కలకోటి ఐలయ్య, మహమ్మద్ యూసఫ్, పప్పు సుబ్బారావు, షేక్ గౌస్‌పాషా, మోటపోతులు జయరాజు, కల్లోజి చంద్రశేఖర్, పిల్లి శ్రీనివాసరావు, తాజుద్దీన్, రామ్‌కోటి తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయసాధనకు పునరంకితం

## -భగత్‌సింగ్ వర్ధంతి ప్రచార పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఖమ్మం :** భగత్‌సింగ్ ఆశయ సాధనకు పునరంకితం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ యువతకు విజ్ఞప్తి చేశారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందని కానీ ప్రస్తుత పాలకులు జనాభాలో 50శాతం పైబడిన యువతను విస్మరించి పాలన కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భారతదేశంలో త్యాగానికి, పోరాటానికి ప్రతీకగా భగత్‌సింగ్ నిలిచారన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో తనదైన పంథాలో పోరాటం సాగించి నునూగు మీసాల ప్రాయంలోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 23న ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధి వట్టిపోయి నిరుద్యోగం తారాస్థాయికి చేరిన ప్రస్తుత పరిస్థితుల్లో భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం పోరాడాలన్నారు. ఏఐవైఎఫ్ యువజన సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం పోరాటాన్ని కొనసాగిస్తుందని రామకృష్ణ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మామిళ్ల శ్రీనాథరెడ్డి, భూక్యా రవీంధర్, జి.ఉపేందర్, కటుకూరి సతీష్‌రెడ్డి, ఉసికల రవి, దండి రమేష్, నామ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేసిన ఎన్‌క్యూఏఎస్ బృందం




**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో జాతీయ నాణ్యత ప్రమాణాలు తనిఖీ బృందం సభ్యులు డాక్టర్ నితిన్‌కుమార్, అనుషా వర్చువల్(వీడియో కాన్ఫరెన్స్) ద్వారా అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి పల్లేదవాఖానలో ప్రజలకు అందించే ముఖ్యమైన 7 విభాగాలు అనగా గర్భిణీలకు, చిన్న పిల్లలకు ఇచ్చే సేవలు, కుటుంబ నియంత్రం, యుక్త వయసు పిల్లలకు అందించవలసిన సేవలు గూర్చి, సంక్రమిత, మరియూ అసంక్రమిత వ్యాధుల గూర్చి, రక్త పరీక్షలు వాటి నివేదికలు గూర్చి, అందుబాటులో వున్న ఔషధాలు వాటి లభ్యత గూర్చి, రోగులకు అందుతున్న చికిత్స యొక్క నాణ్యత వివరాలు గూర్చి, హాస్పిటల్ భవనం, అందుబాటులో ఉండవలసిన పరికరాలు వాటి యొక్క పనితీరు, పాటించవలసిన శుభ్రత వివరాలు, సిబ్బంది పనితీరు. వారు పాటించవలసిన బాధ్యతలు, 14 జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు గూర్చి, ఉండవలసిన రికార్డులు రిజిస్టర్‌లు క్షుణ్ణంగా పరిశీలించి క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఎన్‌క్యూఏఎస్ బృందం చెక్ లిస్ట్ ఆధారంగా అన్ని విషయాలను పరిశీలించి, క్రోడీకరించి కేంద్రానికి నివేదికను సమర్పిస్తారు. ఈకార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రగుంట వైద్యురాలు డాక్టర్ ప్రియాంక పర్యవేక్షణలో డాక్టర్ తన్మయి డాక్టర్ సుభాష్, భద్రాద్రి జిల్లా ఎన్‌క్యూఏఎస్ సభ్యురాలు శృతి వివరించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది పీహెచ్‌ఎం ఎస్తేరు రాణి, జయలక్ష్మి , హెల్త్ సూపర్వైజర్ ప్రకాష్‌రావు, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, రామదాసు, ఫార్మసిస్ట్ ప్రసాదరావు, ఎంఎల్ హెచ్‌వి హేమలత, హారిక, ఆరోగ్య కార్యకర్తలు సుశీల, నాగజ్యోతి, అన్నపురెడ్డిపల్లిలో పని చేసే సిబ్బంది, సోనియా, చంద్రకాంత, దుర్గా భవాని, ఆశా కార్యకర్తలు నాగమణి, బేబి, అనురాధ, కవిత, కరుణ, నాగేశ్వరి, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల కేంద్రంలో పదవ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థులకు నిర్వహించే పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లకు సర్వం సిద్ధం చేశారు. మండల విద్యా వనరుల అధికారి ఉండేటి ఆనంద్‌కుమార్ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2025 సంవత్సరంలో నిర్వహించే పదవ తరగతి పరీక్షలలో మండలం నుండి మొత్తం 303 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని దీనిలో ఎర్రగుంట జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల నుండి 33 మంది విద్యార్థిని విద్యార్థులు చంద్రుగొండ మండలంలో పరీక్షలు రాస్తారని అన్నారు. 140 మంది విద్యార్థిని విద్యార్థులు అన్నపురెడ్డిపల్లి మండలంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ అన్నపురెడ్డిపల్లి పాఠశాలలో, మిగిలిన 130 మంది విద్యార్థులు తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల కళాశాలలో పరీక్షలకు హాజరవుతారని అన్నారు. మండలంలో రెండు సెంటర్లకు ఇద్దరు చీఫ్ సూపర్డింట్‌లను, ఇద్దరు డిపార్ట్మెంట్ అధికారులను, 16 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహించే సమయంలో విద్యార్థిని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖ, పంచాయితీ రాజ్, ఇతర శాఖల సమన్వయాన్ని కోరుతూ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి చర్చించారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# పిఎం శ్రీ జెడ్‌పిఎస్‌ఎస్ వార్షికోత్సవం




**ప్రజాపక్షం/అశ్వాపురం:** పిఎం శ్రీ జెడ్‌పిహెస్‌ఎస్ అశ్వాపురం పాఠశాల వార్షికోత్సవం మార్చి 18న పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి యోగిత వేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి అశ్వాపురం మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఎం శ్రీ పథకం కింద పాఠశాలకు సంబంధించిన భౌతిక వనరుల ఏర్పాటు, పిల్లల అధ్యయనం సంబంధించిన కార్యక్రమాల అభివృద్ధి పథకంతో ముందుకు వెళుతుందని, పాఠశాల పిల్లలకి కావలసిన అన్ని సౌకర్యాలు పాఠశాలలో ఉన్నాయని పిల్లల తల్లి దండ్రులు తమ పిల్లల్ని పాఠశాలలో చదివించాల్సిగా ప్రధానోపాధ్యాయురాలు జి యోగితా వేణి కోరారు. 202425 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల కార్యక్రమాలను సభాముఖంగా తెలిపారు. ఈసమావేశంలో మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి, నెల్లిపాక బంజర ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శంకర్, ప్రాథమిక పాఠశాల అశ్వాపురం పి వెంకటేశ్వరరావు, బీసీ హాస్టల్ వార్డెన్ నరసింహారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** బీసీలు దళితుల అభ్యున్నతికి కృషి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ములకలపల్లి మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల అంజి మాట్లాడుతూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి, మంత్రులు పొన్నం ప్రభాకర్‌కి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కలను సహకారం చేస్తూ దేశంలో ఎక్కడ జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీ, దళిత బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ప్రత్యేక మైన కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందని చెప్పటానికి బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లులను చట్టసభల్లో ప్రవేశపెట్టడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ములకలపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో బాణాసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గోవిందరాజు జాతర ప్రారంభం



**ప్రజాపక్షం/గుండాల :** ఆదివాసి సనప వంశీయుల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీగోవింద రాజు జాతరను నేడు బుదవారం నుండి మూడురోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రతి సంవత్సరం శెట్టిపల్లి గ్రామంలో నిర్వహించుకోవడం వారి ఆనవాయితీగ వస్తుంది. గురు వారం వన దేవతలను గద్దెపైకి చేరడంతో, మూడురోజుల పాటు వారి ఆనవాయితీలో నిర్వహించుకునే ఈ జాతరకు భక్తులు భారిసంఖ్యలో పాల్గొని మొక్కులను చెల్లించుకుంటారు. కార్యక్రమంలో పూజారులు, వడ్డెలు , తలపతులు, సనప వంశీయులు పాల్గొన్నారు.

# బిసి రిజర్వేషన్ బిల్లు పెట్టిన ఘనత కాంగ్రేస్‌దే



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రేస్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు ఓబిసి కొణిజర్ల మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొణిజర్లలో ఆయన మాట్లాడుతు సామాజిక, రాజకీయాల్లో వెనుకబడి ఉన్న బిసిలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రేస్‌పార్టీ కులగణన చేయడం సంతోషకరం అని అన్నారు. కాంగ్రేస్‌పార్టీ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నారని తెలిపారు. బిసి రిజర్వేషన్ బిసి సంఘాలు అన్ని సమిష్టి కృషితో సాధించిన విజయం అన్నారు. రిజర్వేషన్ బిల్లుకు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు ఓబిసి సంఘం నుంచి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల ఆశలు ప్రతిబింభించని రాష్ట్ర బడ్జెట్

**-హామీల అమలు సందిగ్ధమే : సిపిఐ నేత బాగం**




**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ మూడు లక్షల కోట్ల రూపాయలు దాటినప్పటికీ బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రజల ఆశలు ప్రతిభింభించేలా లేవని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ప్రజల ఆశలను ఈ బడ్జెట్ నెరవేర్చదని ఆయన స్పష్టం చేశారు. బడ్జెట్‌పై ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. హామీల అమలుకు రూ. 56వేల కోట్లు కేటాయించినప్పటికీ హామీల అమలు నెరవేర్చే పరిస్థితి లేదన్నారు. సాగునీటికి రూ. 23వేల కోట్లు మాత్రమే కేటాయించడం వల్ల ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యే పరిస్థితి లేదన్నారు. విద్య, వైద్య రంగాలకు కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. గత ఏడాది కంటే విద్యా రంగానికి బడ్జెట్ పెరిగిన ఆశించిన స్థాయిలో లేదన్నారు. పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్ కేటాయింపుల్లో గతేడాది కంటే తగ్గాయని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ శాఖకు గతేడాది కంటే బడ్జెట్ పెంచడం ఆహ్వానించదగిన పరిణామమే అయిన ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ రంగానికి మరిన్ని కేటాయింపులు జరపాల్సి ఉందన్నారు. విద్య, వైద్య రంగాలను విస్మరించినట్లుగానే సంక్షేమ రంగం పట్ల కూడా బడ్జెట్‌లో వివక్ష ప్రదర్శించారని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రం ఎనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందని రాష్ట్ర బడ్జెట్ పరిశీలిస్తే అప్పులు తేస్తేనే రాష్ట్రం నడిచే పరిస్థితి ఉందన్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించిన దానిలో రైతుభరోసాకు, విద్య, వైద్య రంగాలకు కేటాయించిన దానిలో జీత భత్యాలకే సింహ భాగం ఖర్చు అవుతుందని హేమంతరావు తెలిపారు. ఎస్సి, ఎస్టిలకు కేటాయింపులు ఉన్న నిధులు ఖర్చు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్సి, ఎస్టి కేటాయింపులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని నిధుల మళ్లింపు ప్రక్రియకు స్వస్తి పలకాలన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులను తూచ తప్పకుండా అమలు చేయాలని ఆయన సూచించారు. గొప్పలకు పోకుండా అంకెల గారడీ లేకుండా బడ్జెట్‌ను రూపొందించడం ప్రశంసనీయమని హేమంతరావు తెలిపారు. బడ్జెట్ తీపి, చేదుల మేళవింపులా ఉందని ఇప్పుడు అంకిత భావంతో వివిధ రంగాలకు కేటాయించిన వాటిని అమలు చేయాలని హేమంతరావు కోరారు.

# గత బడ్జెట్లకు భిన్నంగా రాష్ట్ర బడ్జెట్

**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్కు భిన్నంగా ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తమ బడ్జెట్ను ప్రవేశ పెట్టిందని, గతంలో అంకెల గారడీ స్పష్టంగా కనిపించగా ప్రస్తుత బడ్జెట్ వాస్తవానికి దగ్గరలో ఉందని, గత బడ్జెట్ కంటే 14,505 కోట్లు తగ్గుదలతో బడ్జెట్ ప్రెవేశపెట్టడం ఇందుకు నిదర్శనమని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్పై సాబీర్ పాషా స్పందిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముందస్తు వ్యూహంలో భాగమేనన్నారు. ఆరు గ్యారంటీలకోసం 56 వేళా కోట్లు కేటాయించడం ఆహ్వానించదగిందే అయినప్పటికీ ఆచరణ అనుమానమేనన్నారు. వ్యవసా రంగానికి బడ్జెట్ పెంచి సాగునీటి ప్రాజెట్లులకు కేవలం రూ.23వేళా కోట్లు మాత్రమే కేటాయించడం సరైంది కాదన్నారు. విద్య, వైద్య రంగాలకు, సంక్షేమ రంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రము రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోండని, అప్పులు తెస్తేనే రాష్ట్ర నడిచే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎస్సి, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని, ఐతే వీరికి కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఖర్చుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయా రంగాలకు కేటాయించిన బడ్జెట్లోని ప్రతి పైసా పూర్తి స్థాయిలో ఖర్చుచేస్తేనే ప్రజలు హర్షిస్తారాన్ని అన్నారు.

# జిల్లాకు అన్యాయం చేసిన రాష్ట్ర బడ్జెట్ : నున్నా



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాకు ఈ బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని సిపిఎం ఖమ్మంజిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ జిల్లాకు ఒరిగింది ఏమి లేదని ఆయన అన్నారు. బడ్జెట్‌పై నున్నా నాగేశ్వరరావు స్పందిస్తూ సీతారామ ప్రాజెక్టుకు కేవలం రూ. 699 కోట్లు కేటాయించడం చూస్తుంటే ఈ జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. అంచనా వ్యయం పెరుగుతుందని కేటాయింపులు తగ్గిపోతున్నాయని ఆయన తెలిపారు. సీతారామ పట్ల వివక్ష అప్పుడు ఇప్పుడు కొనసాగుతూనే ఉందన్నారు. బిసి సంక్షేమానికి రూ. 20వేల కోట్లు కేటాయించాలని బిసి డిక్లరేషన్ ప్రకారం ఎందుకు కేటాయింపులు జరపలేదని నున్నా ప్రశ్నించారు. ఖమ్మంలో యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌కు పరిష్కారం లభించలేదని ఆయన అన్నారు. మూడు లక్షల కోట్లకు పెంచినా ఆదాయ మార్గాలను విశ్లేషించలేదని నున్నా ఆరోపించారు. మిర్చి రైతును ఆదుకునేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

# సంక్షేమానికి కేటాయింపులు తగ్గడం శోచనీయం

**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** సంక్షేమ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గడం శోచనీయమని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. బడ్జెట్‌పై జిల్లా ప్రజలు అనేక ఆశలు పెంచుకున్నారని ఆశలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరగలేదని ఆయన తెలిపారు. బడ్జెట్‌పై భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన సురేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ఈ బడ్జెట్ దోహదం చేసే దిశగా లేదన్నారు. గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెరిగినా రైతు భరోసాకే సగం బడ్జెట్ సరిపోతుందని గ్రామ పంచాయతీలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న వేళ పంచాయతీరాజ్ శాఖకు నిధుల కేటాయింపు తగ్గించడం శోచనీయమన్నారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన బడ్జెట్‌ను చూస్తే సీతారామ ప్రాజెక్టు నిర్మాణం మరి కొంత కాలం జాప్యం జరిగే అవకాశం కనిపిస్తుందన్నారు. బడ్జెట్‌లో అంకెల గారడీ లేకపోయినా వాస్తవ కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు మహిళలకు పేద, మధ్యతరగతి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేవిధంగా బడ్జెట్ రూపకల్పన చేసి ఉండాల్సి ఉందన్నారు. మరో పక్క కేంద్రం వివక్ష ప్రదర్శిస్తున్న తరుణంలో హామీల అమలు కూడా ఒక సవాల్‌గానే మారుతుందని సురేష్ అభిప్రాయపడ్డారు. సంక్షేమ రంగాలకు కేటాయించిన దానిలో ఎటువంటి కోతలు లేకుండా చూడాలని సురేష్ కోరారు. వ్యవసాయ, వైద్య, విద్య, సంక్షేమ రంగాలకు కేటాయింపులపై కమ్యూనిస్టు పార్టీ అసంతృప్తి వ్యక్తం చేస్తుందని ఆయన తెలిపారు. ఇప్పటికీ గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు ఫర్వాలేదనిపించినా ప్రజల ఆశలు ప్రతిఫలించే అవకాశం కనిపించడం లేదని సురేష్ అభిప్రాయపడ్డారు.

# రైతాంగానికి ఇచ్చిన హామీని అమలు చేసే బడ్జెట్

**-సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు నల్లమల**



**ప్రజాపక్షం/ఖమ్మం :** మొత్తం బడ్జెట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలకు 15 శాతం నిధులు కేటాయించడం హర్షించదగిన పరిణామమని సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆయన సంతృప్తిని వ్యక్తం చేస్తూ కేటాయింపులపై హర్షం వెలిబుచ్చారు. వ్యవసాయం, నీటిపారుదల, పశు సంవర్ధక శాఖలకు కలిపి 15 శాతం నిధులు కేటాయించారని ఈ కేటాయింపులతో రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేరతాయన్నారు. సీతారామ ప్రాజెక్టుకు రూ. 700 కోట్లతో పాటు భక్తరామదాసు, తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని ప్రాజెక్టులకు, వైరా ప్రాజెక్టు ఆధునీకరణకు నిధులు కేటాయించినందుకు నల్లమల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రసాయనిక ఎరువులతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భూమి సారం కోల్పోతుందని ఈ నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మళ్లించే క్రమంలో మరిన్ని నిధులు సేంద్రియ వ్యవసాయానికి కేటాయిస్తే బాగుండేదని నల్లమల అభిప్రాయపడ్డారు.

# ప్రజారంజక బడ్జెట్

**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ శాసన సభలో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బుధవారం బడ్జెట్ ప్రజారంజక బడ్జెట్‌గా ఉందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పునర్జీవానికి పునాది వేసిందన్నారు. బడ్జెట్‌లోఅన్ని వర్గాలను కలుపుతూ అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పువ్వాళ్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క రాజ్యాంగబద్ధంగా భావిభారత పౌరుల మనుగడను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను రూపుదిద్దారన్నారు. గత దశాబ్ద కాలం పాలించిన ప్రభుత్వం ఆర్థిక విధ్వంసాన్ని సృష్టించి రాష్ట్రాన్ని అదోగతిపాలు చేశారన్నారు. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ ప్రజలకు సుపరిపాలనను అందిస్తుందన్నారు. ప్రజారంజకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు కాంగ్రెస్‌పార్టీ తరుపున, జిల్లా ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు రూ.24,438 కోట్లు, విద్యుత్ శాఖకు రూ. 21,221 కోట్లు, ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్‌లో అధిక మొత్తం కేటాయించిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు.

# ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల కేంద్రంలో విద్యావనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పిఆర్‌టియు ఆధ్వర్యంలో డిఆర్‌డిఏ సన్యాసయ్యకు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వరరావు (వైవి) మాట్లాడుతూ రఘునాథపాలెంలో విద్యావనరుల కేంద్రం లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు సర్వీస్, శిక్షణా కార్యక్రమాల విషయంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో రఘునాథపాలెం మండలంలో నిర్మించిన విద్యావనరుల కేంద్రంలో డిఆర్‌డిఏ ఆధ్వర్యంలో ఐకెపి వారు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. తక్షణమే వారిని ఖాళీ చేయించి మండల విద్యావనరుల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు రఘునాథపాలెం మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుర్రం కేశవరావు, తుమాటి సైదబాబు, అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడిపుడి శ్రీనివాసరావు, బి. రవికిరణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రత్నకుమార్, కెవి రమణ, రెబ్బా శ్రీనివాసరావు, వెంకన్న, ఆంజనేయులు, సత్యం, జబ్బార్, సురేష్, సతీష్, నారాయణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంక్షలు ఎత్తివేయాలి




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఉస్మానియా క్యాంపస్‌లో అప్రజాస్వామిక పోకడలు సరికాదని, నియంతృత్వ విధానంలో జారీ చేసిన ఆంక్షలను వెంటనే ఎత్తివేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వర్క్ అజిత్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలకు ఉస్మానియా కేంద్రబిందువని, కానీ ఇప్పుడు రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని ఆంక్షలు పెట్టడం సమంజసం కాదన్నారు. క్యాంపస్‌లో నినాదాలు, పోరాటాలు, ధర్నాలు ఉండరాదంటూ రిజిష్ట్రర్ నరేష్ రెడ్డి చేత సర్క్యులర్ జారీ చేయించడం మంచిపద్ధతి కాదన్నారు. ఆరు గ్యారెంటీలతో పాటు రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ఏడో గ్యారెంటీ అంటూ ప్రగతి భవన్ కంచెలను తీసేసిన రాష్ట్ర ప్రభుత్వం నేడు ఉస్మానియాలో ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. విద్యార్థుల సమస్యలు అనేకం ఉన్నాయని, మెస్ బకాయిలు, ఉపకార వేతనాలు, హాస్టల్ మరమ్మత్తులు పెండింగ్ ఫెలోషిప్‌లు, విద్యారంగ అభివృద్ధి కోస ం నిధులు, నూతన భవనాలు, రెగ్యులర్ కోర్సులకు సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సు పేరుతో వేలాది రూపాయల ఫీజులు పెంపు వంటివాటిపై విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని, వీటి గురించి మాట్లాడకుండా విద్యార్థులు గొంతునొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాపాలన పేరుతో నియంతృత్వాన్ని అమలు చేయడం మంచిపద్ధతి కాదని, జారీ చేసిన సర్క్యులర్‌ను వెంటనే వెనక్కు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గుండాల సుజన్, జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, నాయకులు కమల్ రాజ్, వినయ్ తదితరులున్నారు.